
సాక్షి గుంటూరు

మంగళవారం । 8 । జూలై । 2025



నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1000, గరిష్ట ధర రూ.1700, మోడల్ ధర రూ.1300 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 529.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి ఎడమ కాలువకు 3,374 క్యూసెక్కులు విడుదలవుతోంది.



గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ఉంగుటూరు మండలం ఆత్కూరులో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ నెల పదో తేదీన పర్యటించనున్నారు. ఈ పర్యటన ఏర్పాట్లను కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ సోమవారం పరిశీలించారు.

న్యూస్‌రీల్

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ప్రతిపాదనలు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి ప్రతిపాదనలు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారులతో పాటు ఉప విద్యాశాఖాధికారుల ద్వారా ఈనెల 13వ తేదీలోపు https://nationalawardstoteachers.education.gov.in సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రేణుక సూచించారు.

కోటప్పకొండ తొలి ఏకాదశి ఆదాయం రూ.24.02లక్షలు



నరసరావుపేట రూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారికి రూ.24.02 లక్షల ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు తెలిపారు. స్వామి వారి హుండీల లెక్కింపు సోమవారం నిర్వహించి ఆదాయ వివరాలు వెల్లడించారు. టిక్కెట్ల ద్వారా రూ.9,09,090లు, ప్రసాదాల ద్వారా రూ.4,39.380లు, హుండీల ద్వారా రూ. 9,68,028లు, అన్నదానానికి రూ.86,051లు ఆదాయం లభించినట్టు ఆయన వివరించారు.

మెగా పేరెంట్స్ మీట్‌కు పటిష్ట ఏర్పాట్లు



నరసరావుపేట: జిల్లాలో ఈనెల 10న నిర్వహించనున్న 'మెగా పేరెంట్స్ మీట్'కు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1580 ప్రభుత్వ, 458 ప్రైవేట్ పాఠశాలలు మొత్తం 2,308 పాఠశాలలు, 91 జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. హాజరయ్యే వారికి భోజన సదుపాయాలతో ఎటువంటి సమస్యలు లేకుండా జాగ్రత్తగా వండించాలన్నారు.

లైంగిక దాడి కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

గుంటూరు లీగల్: లైంగిక దాడి కేసులో ముద్దాయికి జీవిత ఖైదు విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమీ పర్విన్ సుల్తానా బేగం సోమవారం తీర్పు వెలువరించారు. 2014లో పొన్నూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన లైంగిక దాడి కేసులో 32 సంవత్సరాల మద్దసాని సురేంద్ర 13 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొన్నూరు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో సమర్పించారు. కేసులో నేరం రుజువు కావడంపై ముద్దాయికి జీవిత ఖైదు, రూ. 10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి నష్టపరిహారం కింద ప్రభుత్వం నుంచి రూ. 5 లక్షలు చెల్లించేలా తీర్పు చెప్పారు. ముద్దాయిని జిల్లా జైలుకు తరలించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బరత్ అలీఖాన్ వాదనలు వినిపించారు. బాధిత బాలికకు న్యాయం జరిగిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మహిళ హత్య

బొల్లాపల్లి: మహిళ హత్యకు గురైన సంఘటన మండలంలోని మేళ్లవాగు గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జి.కుమారి (35) పొలాల్లో హత్యకు గురైంది. భార్యాభర్తలిద్దరూ ఉదయం పొలంలో పనికి వెళ్లారు. కుమారి సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లగా కుమారి మృతి చెంది పడి ఉండాన్ని గమనించారు. మృతురాలి భర్త వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నాడు. మృతురాలికి ఇరువురు సంతానం ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.



పులిచింతల భూమిపూజ అనంతరం ప్రసంగిస్తున్న డాక్టర్ వైఎస్సార్ (ఫైల్)

'వైఎస్సార్'.. పేరు వినగానే పేదల మోములు వికసిస్తాయి.. లక్షల జతల నేత్రాలు చెమరుస్తాయి

ఆయనంటే నమ్మకం.. ఆయనుంటే జన సందోహం.. ఆయనే పేదల పాలిట దైవం

ఆరోగ్య శ్రీతో లక్షలాది ప్రజల గుండె సవ్వడుల్లో నేటికీ ఆయన సజీవం

జలయజ్ఞపు జలధారల్లో.. సస్య శ్యామలమైన పంటపొలాల్లో.. అన్నదాతల చిక్కటి చిరునవ్వుల్లో నేటికీ ఆయన చిరునామా శాశ్వతం

ఇంజినీర్లుగా.. వైద్యులుగా రాణిస్తున్న పేదింటి బిడ్డల హృదయాల్లో ఆయన స్థానం చిరస్మరణీయం

సంక్షేమ రేడుగా.. అభివృద్ధి సూరీడుగా.. పేదింటి దేవుడిగా.. వైఎస్సార్ ప్రాతఃస్మరణీయుడు

ఉమ్మడి జిల్లాపై మహానేత మమకారం అపూర్వం.. జిల్లా అభివృద్ధిపై ఆయనది చెరగని సంతకం



ఉమ్మడి జిల్లా పై రాజముద్ర

నేడు మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి

- ఉమ్మడి గుంటూరు జిల్లాకు వైఎస్సార్ పాలన ఓ స్వర్ణ యుగం
- అన్నదాతలపై మమకారానికి చిహ్నంగా పులిచింతల నిర్మాణం
- పశ్చిమ డెల్టా, సాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ
- రాష్ట్రానికే తలమానికం స్పైసెస్ పార్కు నిర్మాణం
- గుంటూరు నగర వాసుల దాహార్తి తీర్చిన రాజన్న
- గుంటూరు నగరంలోనే ఆరోగ్యశ్రీకి అంకురార్పణ
- రాజకీయంగా జిల్లాకు అధిక ప్రాధాన్యం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కష్టాలలో ఉన్న రైతన్నకు గుండె చప్పుడుగా మారారు.. రైతు సంతోషంగా ఉండాలంటే ఏం చేయాలో అన్నీ చేశారు. డెల్టాను స్థిరీకరించేందుకు పులిచింతల ప్రాజెక్టును నిర్మించి.. తనదైన ముద్ర వేశారు.. ఆయనే దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి. గుంటూరు జిల్లాపై ఆయన చెరగని ముద్ర వేశారు. జిల్లాలో 57 సార్లు పర్యటించిన ఘనత ఆయనకే దక్కింది.

'చింత'లు తీర్చిన రాజన్న

జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన పులిచింతల ప్రాజెక్టు 2004, అక్టోబరు 15న రూ. 680 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో విజయవాడ, గుంటూరు నగరాల తాగునీటి దాహార్తి తీర్చడంతోపాటు కృష్ణా డెల్టాలో 13 లక్షల ఆయకట్టు స్థిరీకరించడానికి ఉపయోగపడింది.

● నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ కోసం 2008, ఫిబ్రవరి 2న రూ. 4,444.41 కోట్లతో సాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునీకరణకు అనుమతి ఇచ్చారు. దీని ద్వారా నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో 6.74 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. కృష్ణా పశ్చిమ డెల్టాలో కాలువల ఆధునికీకరణ కోసం రూ. 4,573 కోట్లు కేటాయించారు. ఇందులో గుంటూరు జిల్లాకు సంబంధించి రూ.1760.15 కోట్లను కాల్వల ఆధునీకరణకు కేటాయించారు. ఇందులో రూ.1187 కోట్ల పనులు జరిగాయి. దీని ద్వారా జిల్లాలో 5.22 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది.

● రూ.100 కోట్లు వైఎస్సార్ వరికపూడి శెలకు కేటాయించి శంకుస్థాపన చేశారు.

జిల్లాకు అధిక ప్రాధాన్యం

ఆర్థికంగా, రాజకీయంగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు మహానేత డాక్టర్ వైఎస్సార్ అధిక ప్రాధాన్యం కల్పించారు. జిల్లాకు నాలుగు మంత్రి పదవులు కేటాయించడంతోపాటు, పథకాలు అమలులో సైతం పెద్ద పీట వేశారు.

» రాష్ట్రవ్యాప్తంగా రూ. 12 వేల కోట్ల రుణమాఫీలో జిల్లాకు చెందిన 6.7 లక్షల మందికిపైగా రైతులకు రూ. 560 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది.

» వైఎస్సార్ చివరి సంతకం చేసిన ఫైల్ కూడా జిల్లాలో మిర్చి రైతులకు వాతావరణ ఆధారిత బీమా కింద ప్రయోజనం చేకూర్చేదే. ఈ బీమాతో జిల్లాలో నాలుగు లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందారు.

» ఇందిర ప్రభ పథకాన్ని జిల్లాలోనే ప్రారంభించారు. ఇందిరమ్మ ఫేజ్-2 ఇళ్లను జిల్లాలోనే ప్రారంభించారు.

» రాజీవ్ పల్లెబాట ద్వారా ఎన్నో గ్రామాలకు తాగునీరందించి పల్లె వాసుల మనసులో చెరగని ముద్ర వేశారు.



2004, అక్టోబర్ 15న పులిచింతల ప్రాజెక్టు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)

రాష్ట్రానికే తలమానికం స్పైసెస్ పార్కు

ఉద్యాన పంట మిర్చి సాగు విస్తీర్ణత, ఉత్పత్తుల్లో నాణ్యతా ప్రమాణాలు పెంపొందించేందుకు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పెద్దపీట వేశారు. భారతదేశంలోనే రెండవ అతిపెద్ద స్పైసెస్ పార్కును తెలుగు రాష్ట్రానికి ఆయన తీసుకువచ్చారు. సుమారు రూ.100 కోట్లతో ప్రాజెక్టులో అంతర్గత రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించారు.

» ఈ సుగంధ పార్కుకు జిల్లాలోని యడ్లపాడు మండలం, మైదవోలు – వంకాయలపాడు రెవెన్యూ పంచాయితీల పరిధిలో 124.79 ఎకరాలను ప్రభుత్వానికి కేటాయించారు. 2008 ఆగస్టు 21న వైఎస్సార్ జోరు వానను సైతం లెక్క చేయకుండా వచ్చి ఈ పార్కుకు శంకుస్థాపన చేశారు. స్పైసెస్ బోర్డు అధికారులు ప్రాసెస్ యూనిట్లకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించారు.

» ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో మిర్చి, పసుపు ఇతర సుగంధ ద్రవ్యాల పరిశోధనలు చేయడంతో పాటు అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు, రైతులకు స్థానికంగానే ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి వంటి ఎన్నో ప్రయోజనాలు ఈ స్పైసెస్ పార్కు ద్వారా లభించనున్నాయి.

» పార్కులో 24.77 ఎకరాల్లో రెండు గిడ్డంగులను నిర్మించారు. 6500 మెట్రిక్ టన్నుల నిల్వల సామర్థ్యం కలిగిన ఈ గిడ్డంగులు సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేశారు. ఒక్కొక్కటి ఐదు అంతస్థులు. ఈ భవనాలను ఒకటి మిర్చి, రెండోది పసుపు నిల్వలకు కేటాయించారు. ఆయన మరణించి 16 ఏళ్లు దాటిపోయినా జిల్లా ప్రజల గుండెల్లో ఆయన బతికే ఉన్నారనడంలో అతిశయోక్తి లేదు.

నగరవాసుల తాగునీటి ఇక్కట్లకు చెక్

గుంటూరు నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.6.50 కోట్లతో తక్కెళ్లపాడు రా వాటర్ ప్లాంట్ నుంచి తక్కెళ్లపాడు నీటి శుద్ధి వాటర్ పాంట్ల వరకు రెండోపైపు లైను నిర్మించారు. నగర ప్రజల నీటి కష్టాలు తీర్చిన మహానేతను నగర ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటూనే ఉన్నారు. రూ. 460 కోట్లతో ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన తాగునీటి పథకానికి ఆయనే అంకురార్పణ చేశారు.



గత ఏడాది వరకు నిండు కుండను తలపించేలా పులిచింతల ప్రాజెక్టు రిజర్వాయర్

ఆరోగ్య శ్రీకి ఇక్కడే నాంది

ఎందరో పేదల ప్రాణాలను నిలిపి, మరెందరికో పునర్జన్మ ప్రసాదించిన ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభానికి గుంటూరు జిల్లానే మహానేత వైఎస్సార్ వేదికగా చేశారు. రైతులకు విద్యుత్ బకాయిలు మాఫీ చేయడం ద్వారా జిల్లాలో 80 వేల మందికి రూ.36 కోట్ల లబ్ధి కలిగింది. ఉచిత విద్యుత్ పథకం ద్వారా జిల్లాలోని 80 వేల మంది రైతులకు ఏడాదికి రూ. 281.60 కోట్ల లబ్ధి చేకూరింది. జిల్లాకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రిగా మహానేత వైఎస్సార్‌ను జిల్లా ప్రజలు ఎన్నటికీ మరిచిపోరు.

ఎమ్మెల్యే నరేంద్ర.. నోరు అదుపులో పెట్టుకో!



మాట్లాడుతున్న వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): ధూళిపాళ్ల నరేంద్ర.. నోరు అదుపులో పెట్టుకో.. మన్నవ గ్రామంలో బొనిగల నాగమల్లేశ్వరరావుపై దారుణంగా దాడి చేయించి, నాగమల్లేశ్వరరావు కుటుంబీకులను గూండాలు, రౌడీషీటర్‌లని వ్యాఖ్యానించటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు హెచ్చరించారు. 60 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన ఒక దళిత కుటుంబంపై ఈ రకమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గుంటూరు నగరం బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం తాను, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కలిసి ఆస్పత్రిలో ఉన్న నాగమల్లేశ్వరరావును చూసి రావటం జరిగిందన్నారు. దళిత కుటుంబానికి చెందిన నాగమల్లేశ్వరరావుపై టీ స్టాల్ వద్ద టీడీపీ నేతలు దాడి చేయడం ప్రపంచం మొత్తం చూసిందన్నారు. ఆ కుటుంబానికి చెందిన అమరేంద్రపై కూడా దాడి చేశారని, ఆ కుటుంబాన్ని మట్టుబట్టేందుకు ధూళిపాళ్ల, ఇతర టీడీపీ నేతలు సిద్ధమయ్యారన్నారు. గీత దాటిస్తే భూస్థాపితం చేయండని చెప్పటం.. చంపండి అని చెప్పడం ఒకటేనన్నారు. కచ్చితంగా ధూళిపాళ్ల శిక్షార్హులని, ఆయనపై 307 ఐపీసీ కేసు నమోదు చేయాలని, ఏ1గా పెట్టాలని డిమాండ్ చేశారు.

ధూళిపాళ్ల ఆదేశాలతోనే దాడి: అంబటి మురళీ కృష్ణ

పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల ఆదేశాలతోనే నాగేమల్లేశ్వరరావుపై దాడికి తెగబడ్డారని అంబటి మురళీకృష్ణ నిప్పులు చెరిగారు. ఆసుపత్రిలో ఉన్న నాగమల్లేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉందన్నారు. నాగమల్లేశ్వరరావు ఆరోగ్యంపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాకబు చేశారని తెలిపారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పొంతన లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. నాగమల్లేశ్వరరావు సోదరుడిపై కూడా దాడి చేసినప్పుడు ఆయన ఫిర్యాదు చేస్తే.. తిరిగి అతనిపైనే కేసు నమోదు చేశారన్నారు. కూటమి నేతలకు పోలీసులు, దాసోహమై వ్యవహరిస్తున్నారన్నారు. పొన్నూరు రూరల్ ఎస్ఐ కిరణ్ ఏకపక్షంగా టీడీపీకి మద్దతుగా వ్యవహరిస్తున్నారని.. అన్ని రోజులు ఒకేలా ఉండవన్న విషయాన్ని గుర్తించాలని హెచ్చరించారు. చేబ్రోలు ఎస్ఐ వెంకటకృష్ణచౌదరి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లను స్టేషన్‌కు పిలిపించి, గోడ కుర్చీలు వేయించి, ఒక మేడమ్‌కు వీడియో కాల్ చేసి మరీ చూపిస్తున్నారన్నారు. హోం మంత్రి అనిత, ఒక దళితురాలై ఉండి, నాగమల్లేశ్వరరావు విషయంలో హింసాయుతమైన వాతావరణం ఏర్పడితే, హత్యాయత్నం చేయించింది మీ ఎమ్మెల్యే అని స్పందించటం లేదా అని ప్రశ్నించారు.

అర్జీల పరిష్కారం మరింత వేగవంతం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: అర్జీల పరిష్కారంలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అటువంటి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సులభంగా పరిష్కరించగలిగే వాటి కోసం అర్జీదారులను పదే పదే తిప్పుకోవద్దన్నారు. అర్జీదారులతో సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని తెలిపారు. 259 అర్జీలను కలెక్టర్‌తోపాటు జేసీ ఎ.భార్గవ్ తేజ, డీఆర్ఓ ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

బాగున్న రోడ్డుపైనే మళ్లీ రోడ్డు..

ఎన్నో గ్రామాల్లో రోడ్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అయితే తాడికొండలోని పాత సినిమా థియేటర్ ఎదుట బాగున్న 80 మీటర్ల సిమెంట్ రోడ్డుపై మళ్లీ కొత్త రోడ్డు వేశారు. రోడ్డుకు ఇరు వైపులా డ్రైనేజీ నీళ్లు నిలిచి పోతున్నాయి. పాదచారులకు ఇబ్బందిగా ఉందని ఫిర్యాదు చేస్తే స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదు.

– కె.పూర్ణచంద్రరావు, స్రవంతి దంపతులు, తాడికొండ

కలెక్టరేట్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు

మాకు వడ్లమూడిలో వ్యవసాయ భూమి ఉంది. దీనికి సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయమని అధికారులకు అర్జీ పెట్టుకున్నాం. ఇప్పుడు ఈ వ్యవహారం కలెక్టరేట్‌లోని 'హెచ్' సెక్షన్‌కు వచ్చింది. కనీసం సిబ్బంది సమస్య పరిష్కరించకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాక్షాత్తూ కలెక్టరేట్ సిబ్బంది ఇలా వ్యవహరిస్తే ఎలా? మాకు న్యాయం చేయాలని మనవి.

– ఎస్.స్వరాజ్య లక్ష్మి, గుంటూరు

సక్రమంగా మెగా టీచర్స్ పేరెంట్స్ సమావేశం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ఈనెల 10న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో జరుగనున్న మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ 2.0 నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం జరగాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో కలెక్టర్, జేసీ ఎ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హాతో కలిసి నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ దీనికి సంబంధించి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, విద్యాశాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ సమావేశంపై గ్రామ, మండల, పట్టణాల్లో వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాలు, ఇతర ప్రచార అంశాల ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులు, పూర్వ విద్యార్థులతోపాటు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దలను ఆహ్వానించేలా చర్యలు చేపట్టాలన్నారు.



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

సమావేశం జరిగే రోజు ఏర్పాటు చేయనున్న భోజనానికి సరుకులు ముందే సిద్ధపరుచుకోవాలని పేర్కొన్నారు.

● జేసీ భార్గవ్‌తేజ మాట్లాడుతూ హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలుకు సంబంధించి రైతు సేవా కేంద్రాల్లో రైతులు వారి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కొనుగోలుకు సంబంధించి నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలపై రైతులకు వ్యవసాయ అధికారులు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. కొలు రైతులు పీసీఆర్డీ కార్డులు నిర్దేశించిన లక్ష్యాల మేరకు అందించాలని తెలిపారు. సమావేశంలో డీఈఓ టి.వి.రేణుక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇన్‌కమ్ టాక్స్ అధికారి మృతి



జే.పంగులూరు: డివైడర్‌ను ఢీకొని రోడ్డు ప్రమాదంలో ఇన్‌కం టాక్స్ అధికారి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని జాగర్లమూడివారిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. హైవే పోలీసుల వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన దాసరి కృష్ణచైతన్య (46) గుంటూరులోని ఇన్‌కం టాక్స్ ఆఫీసులో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం ఒంగోలులోని తన మామయ్య ఇంటి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఒంగోలు నుంచి గుంటూరుకు తన స్కూటీపై వెళ్తున్నారు. జాతీయ రహదారిపై జాగర్లమూడివారిపాలెం వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కృష్ణచైతన్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.

క్లుప్తంగా

అక్షరాస్యత శాతం పెంపునకు కృషి చేద్దాం

గుంటూరు వెస్ట్: జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంపొందించేందుకు అధికారులు సమష్టి కృషితో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వయోజన (15 నుంచి 59 సంవత్సరాల మధ్య) నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ – అక్షర ఆంధ్రా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శక ప్రకారం నిర్వహించాలన్నారు. సమాజంలో నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో 80 లక్షల మంది నిరక్ష్యరాస్యులు ఉన్నారని, వీరిని అక్షరాశ్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలు ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకున్నాయన్నారు. ప్రాథమిక అక్షరాశ్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ అవగాహన తదితర అంశాల్లో ప్రజలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉందన్నారు. గ్రామ స్థాయిలో అధికారులు నిరక్ష్యరాస్యులకు అవగాహన కల్పించాలన్నారు. నిరక్ష్యరాస్యులకు ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు మొత్తం 100 గంటల విద్యాబోధన నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ షేక్ ఖాజావలి, డెప్యూటీ కలెక్టర్‌లు గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, డీఈఓ రేణుక, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'నూటా' ఎన్నికలను బహిష్కరిస్తూ ఎన్నికల అధికారికి లేఖ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అధ్యాపక సంఘం(నూటా) ఎన్నికల్లో పారదర్శకత లోపించడం వలన ఈ నెల 9న జరిగే నూటా ఎన్నికలను బహిష్కరిస్తూ ఎన్నికల అధికారి ఆచార్య మురళీ మోహన్‌కు సోమవారం లేఖ అందజేసినట్లు ఆచార్య కె.సుమంత్ కుమార్(అధ్యక్ష పదవికి పోటీ అభ్యర్థి), ఆచార్య ఎం.జగదీష్ నాయక్(ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీ అభ్యర్థి) తెలిపారు. తమకు పోటీగా నిలబడిన అభ్యర్థులు విశ్వవిద్యాలయం పరిపాలన పరమైన పదవుల్లో కొనసాగటం వలన ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, దీనివల్ల ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపిస్తుందని, కనుక ఎన్నికల నిర్వహణ విధానంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ 15 రోజులు పాటు ఎన్నికలను వాయిదా వేయాలని ఈనెల 4, 5 తేదీల్లో ఎన్నికల అధికారి ఆచార్య మురళీమోహన్‌కు వినతి పత్రాలు అందించినా నేటికీ తగిన చర్యలు తీసుకోకపోవడంతో పాటు తమ లేఖలకు ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడం నిరసిస్తూ ఎన్నికలను బహిష్కరిస్తున్నామన్నారు.

చదరంగంలో చిచ్చర పిడుగులు

- ఫిడే రేటింగ్స్‌తో దూసుకుపోతున్న గుంటూరు క్రీడాకారులు
- ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ రేసులో నిహారిక



చదరంగం ఆడుతున్న క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): మేధావుల క్రీడగా పేరు గాంచిన చదరంగానికి ఘన చరిత్రే ఉంది. మన దేశంలో పుట్టి ఖండాంతరాలు విస్తరించిన ఈ క్రీడలో రాణించాలంటే అంత సులభం కాదు. ఏకాగ్రతతోపాటు అకుంఠిత దీక్ష ఎంతో ముఖ్యం. ఈక్రీడలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారికతోపాటు ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్స్ మెహర్, మౌనిక, అక్షయ లాంటి వారు గుంటూరుకు చెందిన వారే. చక్కని క్రీడాకారులతోపాటు ప్రతిభగల కోచ్‌లు కూడా జిల్లాలో అందుబాటులో ఉన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 200 మందికి పైగా చిన్నారులు చెస్ సాధన చేస్తున్నారు. ఈ క్రమంలోనే స్థానికంగా చెస్ శిక్షణలో పేరుతెచ్చుకున్న జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు దూసుకుపోతున్నారు. ఈ నెల 10 నుంచి ఫ్రాన్స్‌లో జరగనున్న అంతర్జాతీయ ఫిడే రేటింగ్ టోర్నమెంట్‌కు చల్లా నిహారిక ఎంపికయ్యింది. ప్రస్తుతం ఆమె 2072 ఫిడే రేటింగ్స్‌తో ఉంది. ఈ సీజన్ అనుకున్నట్లు జరిగితే ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా సాధించే అవకాశముందని కోచ్ చల్లా రవీంద్ర రాజు అంటున్నారు.

ఉమెన్ ఇంటర్నేషనల్ రేటింగ్ సాధిస్తా



ఈ నెలలో ఫ్రాన్స్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ పోటీల్లో నా ఫిడే రేటింగ్ మెరుగు పరచుకునే అవకాశముంది. ప్రస్తుతం 2072 పాయింట్లతో ఉన్నాను. 2200 పాయింట్లు వస్తే ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా దక్కుతుంది. గత ఏడాది ఇటలీలో జరిగిన బెల్లా ఇటాలియన్ 2100 పాయింట్ల లోపు టోర్నమెంట్‌లో ప్రథమ స్థానం నాకు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చింది. ఇప్పటివరకు 20 అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నాను. ఈ ఏడాది గుజరాత్‌లో జరిగిన జాతీయ మహిళల చెస్ పోటీల్లో టీమ్ విభాగంలో తృతీయ స్థానం లభించింది. ఎంబీఏ చేస్తున్నాను. చదువును, చెస్‌ను సమన్వయం చేసుకోవడం కొంచెం కష్టమే. అయితే ఉన్న సమయాన్ని ప్లాన్ చేసుకుంటే చాలా సులభం. మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఇంత వరకు వచ్చాను. దీంతోపాటు కోచ్ రవీంద్ర రాజు శిక్షణ ఎంతో నేర్పింది.

– చల్లా నిహారిక, గుంటూరు

చదరంగం ఏకాగ్రతను పెంచింది



నా తండ్రి చెస్ కోచ్. ఆయనతోనే ఉండడం వలన చెస్‌పై ఆసక్తి పెరిగింది. చెస్‌లో ప్రతి రోజూ నేర్చుకునేందుకు ఎంతో ఉంటుంది. దీంతో ఏకాగ్రత పెరిగింది. అది నా చదువుకు ఉపయోగపడింది. ఇటీవలే ఐఐటీలో ఎంటెక్ సీటు వచ్చింది. నాకు ప్రస్తుతం 1589 ఫిడే రేటింగ్ ఉంది. అంతర్ విశ్వవిద్యాలయాల చెస్ టోర్నమెంట్‌లో 5వ స్థానం సాధించడంతోపాటు పలు జాతీయ పోటీల్లోనూ పాల్గొన్నాను. చదువుతోపాటు ఫిడే రేటింగ్ పెంచుకోవడమే లక్ష్యం. గ్రాండ్ మాస్టర్ హోదా కోసం కృషి చేస్తాను.

– చల్లా చైతన్య రాజు, గుంటూరు

చాలా నేర్చుకోవాలి



ప్రస్తుతం నా వయస్సు 12 సంవత్సరాలు. నాకు 1459 ఫిడే రేటింగ్ ఉంది. ఇప్పటికే 10 నేషనల్స్‌లో పాల్గొన్నాను. 7వ తరగతి చదువుతున్నాను. చెస్‌పై ఎంతో మక్కువ. అందుకే నిత్యం రెండు మూడు గంటల సాధన చేస్తున్నాను. గ్రాండ్ మాస్టర్ అవ్వడమే లక్ష్యం. రానున్న కాలంలో మరిన్ని ఇంటర్నేషనల్ పోటీల్లో పాల్గొంటాను. కోచ్‌తోపాటు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ఉంది. ఈ క్రీడలో రాణించాలంటే సాధనతోపాటు ఇష్టం కూడా ఎంతో ఉండాలి. చెస్ కారణంగా నాకు చదువులోనూ మంచి ఏకాగ్రత లభిస్తుంది. సమయాన్ని ఎక్కువగా చెస్ మీదే గడపడం వలన సెల్ ఫోన్ చూడను.

– కె.సాత్విక, గుంటూరు

శిక్షణ తీరు మారింది.



గత ఐదేళ్లలో చెస్‌లో శిక్షణ విధానం చాలా మార్పు వచ్చింది. ముఖ్యంగా ఆధునిక టెక్నాలజీ చెస్‌కు చాలా ఉపయోగపడుతుంది. సరదాగా చెస్ ఆడుదామనుకునే వారు దీన్లోకి రావద్దని చెబుతాను. నా వద్ద ప్రస్తుతం 40 మంది శిక్షణ తీసుకుంటున్నారు. వారిలో కొందరు త్వరలోనే ఇంటర్నేషనల్ హోదా సాధిస్తారు. ఆ స్థాయిలో రాణించాలంటే రోజుకు కనీసం 6 గంటల సాధన చేయాలి. నేర్చుకునే దానికంటే నేర్చుకోవాల్సిందే ఎక్కువగా ఉంటుంది. నా శిక్షణ విధానం రిజల్ట్ కోసమే ఉంటుంది. దీని కోసం ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తాను.

– రవీంద్ర రాజు చల్లా, ఫిడే ఇన్‌స్ట్రక్టర్, ఇంటర్నేషనల్ చెస్ కోచ్, జీనియస్ చెస్ అకాడమీ

ఏరుదాటాక తెప్ప తగలేసే రకం చంద్రబాబు

- గతంలో రైతురుణమాఫీని ఏవిధంగా చేశారో చూశాం
- ఇప్పుడు సూపర్‌సిక్స్ హామీలపైనా మోసం
- అదేమంటే నాలుక మందం అంటున్నాడు
- కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే తీవ్ర ప్రజావ్యతిరేకత
- ప్రజలకు మరింత అవగాహన కల్పించేలా కృషి జరగాలి
- బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



బాబు మోసాలపై క్యూ ఆర్ కోడ్ షీటును ప్రదర్శిస్తున్న అంబటి రాంబాబు, శివకుమార్, పార్టీ నేతలు

తెనాలి: ఏరుదాటాక తెప్ప తగలేసే చరిత్ర చంద్రబాబుది.. గతంలో రైతు రుణమాఫీని ఏవిధంగా చేసిందీ చూశాం. జనసేన, టీడీపీల ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ హామీలనూ కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు గుర్తుచేశారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' పై తెనాలి నియోజకవర్గ సమావేశం సోమవారం సాయంత్రం ఇక్కడి గంగానమ్మపేటలోని ఎం.కన్వెన్షను హాలులో జరిగింది. పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించారు. అంబటి రాంబాబు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీలను నిలబెట్టుకోకపోగా బుకాయిస్తున్నాడని, పోలీస్ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకుని ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే నిర్బంధించటం మినహా పరిపాలనపై దృష్టిలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పర్యటనలకు తండోపతండాలుగా జనం వస్తుండటాన్ని చూసి, ఎక్కడ తనపై వ్యతిరేకత వస్తుందోనని చంద్రబాబు కక్షగట్టారని చెప్పారు. పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు చేసిన మోసాన్ని చాటుతారని హెచ్చరించారు.

దిక్కుతోచని స్థితిలో ప్రజలు

సభాధ్యక్షుడు అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలను అమలుచేయని కారణంగా ఒక్కో కుటుంబం ఏడాదిలో ఆర్థికంగా ఎంత నష్టపోయిందీ అవగాహన కల్పించాలని చెప్పారు. తెనాలిలో మూడు పార్టీల జెండాలు మెడలో వేసుకుని ఓట్లు అడిగిన నాయకులు, అధికారంలోకి వచ్చాక ఎవరికివారే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవాచేశారు. ఒకరికి సమస్యలు చెబితే పరిష్కారం కావనీ, ఇంకొకరికి చెబుదామంటే అందుబాటులో ఉండరని వ్యాఖ్యానించారు. ఎవరికి చెప్పుకోవాలో తెలీక దిక్కుతోచని స్థితిలో ఉన్న ప్రజలను కలిసి ఏమేరకు నష్టపోయిందీ తెలియజెప్పాలన్నారు.

క్యూఆర్ కోడ్ షీట్ ఆవిష్కరణ

తొలుత చంద్రముఖి సూపర్‌ఫ్లాప్–6 డీజే మిక్స్ ఆడియోను పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకుతెచ్చే క్యూఆర్ కోడ్ షీట్‌ను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, తెనాలి, కొల్లిపర ఎంపీపీలు భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, ధర్మరాజుల చెన్నకేశవులు, పార్టీ అధ్యక్షులు దేసు శ్రీనివాసరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, కళ్లం వెంకటప్పారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ రహిమా, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ, జిల్లా అధికార ప్రతినిధి కొడాలి క్రాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, పార్టీ ఇతర నాయకులు మాట్లాడారు. నియోజకవర్గం నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో హాజరయ్యారు.

సాగు చేయనీకుండా అడ్డుకుంటున్నారు

- జిల్లా ఎస్పీకి కౌలు రైతు ఫిర్యాదు
- పోలీసు పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరణ



బాధిత మహిళ సమస్యను ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జనసేన పార్టీ నేత తమ పొలం వైపు వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నాడని కౌలు రైతు వాపోయాడు. షేర్ ట్రేడింగ్ మార్కెట్‌లో దాదాపు రూ.27 లక్షలు పోగొట్టుకున్నట్లు మరో బాధిత ఉపాధ్యాయురాలు వాపోయింది. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు – పరిష్కారాల వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో బాధితులు పలు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు.

జనసేన నేత అడ్డంకులు సృష్టిస్తున్నాడు



ఇటీవల జొన్నలగడ్డ గ్రామ పరిధిలోని సుగాలికాలనీ సమీపాన రెండు ఎకరాల పొలం కౌలుగా తీసుకున్నాను. ఫైనాన్స్ కింద ట్రాక్టర్ తీసుకుని వ్యవసాయ పనులు చేస్తున్నా. అయితే పొలం సాగు చేసుకునే క్రమంలో జనసేన పార్టీకి చెందిన గ్రామ ఉప సర్పంచి అడ్డంకిగా మారాడు. ఈ క్రమంలో పొలానికి వెళ్లే దారిలో అడ్డగించడం, వ్యవసాయ పనులకు ఆటంకం కలిగించడం చేస్తున్నాడు. గత మంగళవారం ట్రాక్టర్‌పై పొలం వెళ్తుండగా అడ్డగించి దూషించాడు. తమ సామాజిక వర్గానికి చెందిన మంత్రి ఉన్నాడని, ఊరు వదిలి వెళ్లకపోతే సహించేదిలేదని బెదిరించాడు. ఉప సర్పంచిపై చర్యలు తీసుకుని, మా కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరుతున్నా.

– కె.రామునాయక్, శ్రీనునాయక్, బాలునాయక్, సుగాలి తండా, జొన్నలగడ్డ గ్రామం, గుంటూరు రూరల్ మండలం.

న్యూరాలజిస్టుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ సుందరాచారి



ప్రిన్సిపాల్ డాక్టర్‌సుందరాచారిని అభినందిస్తున్న న్యూరాలజిస్టులు

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన సీనియర్ న్యూరాలజిస్టు, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరులో అసోసియేషన్ 32వ వార్షిక సమావేశం జరిగింది. సమావేశంలో డాక్టర్ సుందరాచారిని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఏడాదిపాటు డాక్టర్ సుందరాచారి రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. కాగా, ఈ సమావేశంలో గుంటూరుకు చెందిన వైద్య విద్యార్థులు డాక్టర్ పి.సాయిలక్ష్మి ఫ్రీ పేపర్ ప్రజంటేషన్ పోటీల్లో రాష్ట్రంలో మొదటి బహుమతి గెలుపొందారు. డాక్టర్ పి.వల్లికృష్ణప్రియ పోస్టర్ ప్రజంటేషన్ పేపర్‌లో మొదటి బహుమతి గెలుపొందారు. సోమవారం గుంటూరు వైద్య కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు న్యూరాలజిస్టులు నూతనంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్‌సుందరాచారిని అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారీ గెలుపొందిన వైద్య విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, డాక్టర్ గొట్టి పాటి బిందు నర్మద, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా 'ఐ యేట్ ఇండియా'

ముగిసిన రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు
ఇదే నాటికకు మరో నాలుగు బహుమతులు



ఉత్తమ ప్రదర్శన బహుమతిని స్వీకరిస్తున్న విజయవాడ సమాజం బాధ్యులు

తెనాలి: రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో మూడురోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి ద్వితీయ ఆహ్వాన నాటికల పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. న్యూస్టార్ మోడ్రన్ థియేటర్స్, విజయవాడ వారు ప్రదర్శించిన 'ఐ యేట్ ఇండియా' ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. మరో నాలుగు బహుమతులను అందుకుంది. ఇదే నాటికకు ఉత్తమ దర్శకత్వం (డాక్టర్ ఎం.ఎస్.చౌదరి), ఉత్తమ ఆహార్యం (దినేష్), ఉత్తమ రంగాలంకరణ (దివాకర ఫణీంద్ర), జ్యూరీ బహుమతి (లోహిత్) సహా మొత్తం ఐదు బహుమతులు లభించాయి.

- ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాభారతి, విశాఖపట్నం వారి 'ఖరీదైన జైళ్లు' నాటిక ఎంపికైంది. ఇదే నాటిక ఉత్తమ నటి (శోభారాణి), ఉత్తమ క్యారెక్టర్ నటి (నాగరాణి), బహుమతులను అందుకుంది. తృతీయ ఉత్తమ ప్రదర్శన బహుమతిని తెలుగు కళాసమితి, విశాఖపట్నం వారి 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' నాటిక దక్కించుకుంది. ఇదే నాటికకు ఉత్తమ రచన (పీటీ మాధవ్), ఈ నాటికలో నటించిన పి.వరప్రసాద్ ఉత్తమ నటుడు బహుమతిని, డి.హేమ ఉత్తమ ప్రతినాయకురాలు బహమతులను గెలుచుకున్నారు.
- ఇతర ప్రదర్శనల్లో 'అ సత్యం' నాటికకు ఉత్తమ సంగీతం (పి.లీలామోహన్), ఆ నాటికలో నటించిన పి.రామారావుకు ఉత్తమ క్యారెక్టర్ నటుడు బహుమతి లభించాయి. 'వీడేం మగాడండీ బాబూ' నాటికలో నటించిన జీఎస్ చలపతికి ఉత్తమ హాస్యనటుడు బహుమతి లభించాయి. 'అనుకున్నదొకటి అయినదొకటి'నాటికలో పిల్ల బిచ్చగాడు పాత్రధారి రుత్విక్‌కు జ్యూరీ బహుమతి వచ్చింది. న్యాయనిర్ణేతలుగా చెరుకుమల్లి సింగారావు, వి.హైమావతి, గోపరాజు విజయ్ వ్యవహరించారు. పోటీల అనంతరం ఈదర వెంకట పూర్ణచంద్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజేతలకు బహుమతులను అందజేశారు. సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, డీఎల్ కాంతారావు పాల్గొన్నారు. తొలుత పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి జ్యోతిప్రజ్వలతో చివరిరోజు కార్యక్రమాలను ఆరంభించారు. తెలుగు కళాసమితి, విశాఖపట్నంవారి 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత?' నాటికను ప్రదర్శించారు. పీటీ మాధవ్ రచనకు చలసాని కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. చివరగా చైతన్య కళాభారతి, కరీంనగర్‌వారి 'ఖరీదైన జైళ్లు' నాటికను ప్రదర్శించారు. పి.వెంకటేశ్వరరావు మూలకథకు పరమాత్ముని శివరాం నాటకీకరించగా, మంచాల రమేష్ దర్శకత్వం వహించారు. నిర్వాహక సంస్థల బాధ్యులు నల్లూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకట నారాయణ, ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఏఎన్‌ఎంల కౌన్సెలింగ్‌లో గందరగోళం

- డీఎంహెచ్ఓ చాంబర్‌లోనే తలుపులు మూసి కౌన్సెలింగ్
- నిబంధనలు పాటించకుండా కౌన్సెలింగ్ చేస్తున్నారంటూ ధర్నా

గుంటూరు మెడికల్: కొద్దిరోజులుగా ఏఎన్ఎంల (గ్రేడ్–3) బదిలీల కౌన్సెలింగ్ గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో జరుగుతుంది. నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్నారంటూ ఏఎన్ఎంలు ఆరోపణలు చేస్తున్నారు. మూడు రోజుల క్రితం కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ చేసిన ఏఎన్ఎంలకు సోమవారం తిరిగి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఫోన్‌లో తెలపగా పలువురు డీఎంహెచ్ఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేచి ఉన్నా ఏ విషయం చెప్పలేదని ఏఎన్ఎంలు ఆందోళన వ్యక్తం చేశారు.

డీఎంహెచ్ఓ చాంబర్‌లో తలుపులు మూసి..

సాధారణంగా కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించే సమయంలో తొలుత ఖాళీల వివరాలు తెలియజేయాలి. సీనియార్టీ జాబితా విడుదల చేయాలి. ఏ సమయంలో నిర్వహిస్తారు. ఎవరెవరికి ప్రాధాన్యత కల్పిస్తారనే విషయాలు తెలియజేయాలి. ఇవేమీ పాటించలేదు. డీఎంహెచ్ఓ చాంబర్‌లో తలుపులు మూసి లోపల కౌన్సెలింగ్ చేస్తున్నారు. అభ్యర్థులు తొలుత ఐదు ప్రాంతాలు కోరుకుంటున్నట్లు తెలిపారు. వాటిల్లో ఏ ఒక్కటీ కేటాయించలేదు. నూతన ప్రాంతాలు కేటాయించడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

కొంతమందికే 'సిఫారసు'..

ఏఎన్ఎంల బదిలీ కౌన్సెలింగ్‌లకు ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇస్తే కొంత మందికి తాము కోరుకున్న ప్రాంతంలోనే బదిలీ చేశారు. కొంత మందికి లేఖ ఉన్నప్పటికీ వేరొక ప్రాంతానికి బదిలీ చేయడంతో ఆందోళన వ్యక్తం చేశారు.

ఉన్నతాధికారుల అక్షింతలు

కొంత మంది ఏఎన్ఎంలు పదోన్నతిపై రీ–డిప్లయిమెంట్‌లో భాగంగా గ్రేడ్–3 నుంచి గ్రేడ్–2కు ప్రమోషన్ పొంది ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వారు బదిలీ అయిన ప్రాంతాన్ని ఖాళీగా చూపించి మూడు రోజుల క్రితం జరిగిన బదిలీ ప్రక్రియలో ఇతర ఏఎన్ఎంలకు కేటాయించారు. దీంతో రీ–డిప్లయిమెంట్ ప్రమోషన్ పొందిన ఏఎన్ఎంలు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఉన్నతాధికారుల నుంచి డీఎంహెచ్ఓ కార్యాలయం అధికారులకు అక్షింతలు పడ్డాయి. పదోన్నతి పొందిన ఏఎన్ఎంల ప్రాంతాలను ఖాళీలుగా చూపించకుండా వారిని అక్కడే కొనసాగించాలంటూ ఉత్తర్వులు వచ్చాయని పలువురు ఏఎన్ఎంలు తెలిపారు. పదోన్నతి పొంది వెళ్లిపోయిన ఏఎన్ఎం ఖాళీలో మూడు రోజుల క్రితం నూతనంగా చేరిన ఏఎన్ఎంలు తమను మళ్లీ వెనక్కి పంపిస్తే ఊరుకోమంటూ అడ్డం తిరుగుతున్నారు. దీంతో ఏఎన్ఎంలు రెండు వర్గాలుగా విడిపోయారు. కౌన్సెలింగ్‌ను రద్దు చేసి, మంగళవారం తిరిగి నిర్వహించాలని కొంత మంది ఏఎన్ఎంలు డిమాండ్ చేస్తున్నారు.

ఏఎన్ఎంల ధర్నా

డీఎంహెచ్ఓ కార్యాలయం అధికారులు చేసిన అనాలోచిత విధానాల వల్ల తాము తీవ్రంగా నష్టపోయామంటూ పలువురు ఏఎన్ఎంలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు కూర్చొబెట్టి నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ చేయడం లేదని ఆరోపిస్తూ ధర్నా చేశారు.



సోమవారం రాత్రి ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు